జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 5-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 608 పేజీలు: 4 వెల : రూ.7

## వసతి గృహాల్లో.. డ్రైనేజీ.. దొ్యమేజీ





* కాంపౌండ్‌కు ఆనుకుని మురుగునీరు నిల్వ * దోమలు స్వైరవిహారం * ఇబ్బందులు పడుతున్న హాస్టల్ విద్యార్థినులు * డయేరియా బారిన పడే అవకాశం ఉందని ఆందోళన

**శ్రీకాకుళం, మార్చి 4 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని ఎస్టీ, బీసీ వసతి గృహాల వద్ద డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో కాంపౌండ్ వాల్‌కు ఆనించి నిల్వ ఉంటోంది. డ్రైనేజీల నుంచి వస్తున్న దుర్వాసన, దోమల బెడదతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. ఉమెన్స్ కాలేజీ కాంపౌండ్‌ను అనుసరించి గల గిరిజన సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహం ఉంది. అక్కడ ఉన్న ఖాళీ ప్రదేశంలో డ్రైనేజీ నీరు నిల్వ ఉంటోంది. సమీకృత హాస్టల్ కాంపౌండ్ ఆవరణలో బీసీ హాస్టల్3లోనూ ఇదే పరిస్థితి ఉంది. డ్రైనేజీ నీరు దిగువకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో చిన్నపాటి చెరువులా మురుగునీరు నిల్వ ఉండిపోయింది. పందులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. బీసీ హాస్టల్‌లో ఆర్‌వో ప్లాంట్ లేకపోవడంతో తాగునీటికి విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. వంటలు వండే ప్రదేశం కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహాల్లో సమస్యలపై దృష్టి సారించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

## పాత నేరస్థులపై.. నిఘా తప్పనిసరి

* పెండింగ్ కేసుల తగ్గింపు, కోర్టు వ్యవహారాల్లో సమయపాలన పాటించాలి * ప్రజా సేవా దృక్పథంతో పనిచేయండి * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి * జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం




**శ్రీకాకుళం క్రైం, మార్చి4 (వార్త):** పాత నేరస్థులపై నిఘా, కౌన్సెలింగ్ తప్పనసరి అని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. కేసులు దర్యాప్తు, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, కోర్టు వ్యవహారాలు, నాన్ బెయిల్బుల్ వారెంట్లు అమలు, చర్యలు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవల అంశాలపై పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. ప్రజల నుంచి అందిన పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల స్వీకరణ) వినతుల పరిష్కార స్థితిని సమీక్షించి, ప్రతి వినతిని చట్టపరంగా, సమయపాలనతో పరిష్కరించాలని సూచించారు. ప్రజల నమ్మకం నిలబెట్టే విధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్రైమ్, లా ఆర్డర్, విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అంశాల్లో అధికారుల వారీ పనితీరును సమీక్షించారు. ముఖ్యమైన పెండింగ్ కేసులు దర్యాప్తు పై ఆరా తీస్తూ పెండింగ్ నకు గల కారణాలు, దర్యాప్తులో పాటించవలసిన నియమాలపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీర్ఘకాల పెండింగ్ కేసులు, మిస్సింగ్ కేసులు సహా అన్ని హెడ్‌లలో యు.ఐ కేసుల స్థితిని సమీక్షించారు. దీర్ఘకాల పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్, నూతన క్రిమినల్ చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. ప్రతి అధికారి చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ-చలాన్ల విధింపు, వసూళ్ల పురోగతిని సమీక్షించారు. నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, చార్జ్ షీట్లు దాఖలు తదితర కోర్టు సంబంధిత అంశాలను సమీక్షించి, సమయపాలనతో వ్యవహరించాలని ఆదేశించారు. కోర్టు వ్యవహారాల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్ భాగంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలన్నారు. రాత్రి గస్తీ, బీట్ తీరును సమీక్షించి, అప్రమత్తంగా ఉండాలని, డయల్ 112 కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని, ప్రతి కాల్‌ను ప్రాధాన్యతగా పరిగణించాలని ఆదేశించారు. లోక్ అదాలత్ లో రాజీ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో నేరాలు నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, ప్రజా సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. పెండింగ్ కేసుల తగ్గింపు, కోర్టు వ్యవహారాల్లో సమయపాలన, విజిబుల్ పోలీసింగ్ బలోపేతం ద్వారా ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఎస్పీ తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, ఎస్టి సిఐ ఇమాన్యువల్ రాజు, డిసిఆర్బి సీఐ శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించాలి

*** అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్**



**శ్రీకాకుళం,మార్చి4(వార్త):** జిల్లాలో ఆరోగ్య శాఖ సరఫరా చేసే ఓఆర్ఎస్ ప్యాకెట్లు మాత్రమే వినియోగించాలని అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ వెల్లడించారు. బుధవారం రిమ్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఓఆర్ఎస్‌లో డీహైడ్రేషన్ కట్టడిచేయు లవణాలు, వివిధ పోషకాలు కలిగి ఉంటాయన్నారు. బయట లభించే ఫ్యాన్సీ ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, డబ్ల్యూహెచ్‌వో నిబంధనలు ప్రకారం లేని ద్రావణాలని, వాటిలో నిర్దేశించిన పునర్జలీకరణ జరగదని వివరించారు. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉంటూ కేవలం ప్రభుత్వ వైద్య సిబ్బంది వారు సరఫరా చేసిన ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు మాత్రమే వాడుట ఆరోగ్యానికి మంచిదని ఆయన తెలిపారు.

## 6న ఉద్యోగ మేళా

**శ్రీకాకుళం, మార్చి 4(వార్త):**నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించేందుకు ఈనెల 6న శ్రీకాకుళంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి ఈ ఎంపికలు ప్రారంభమవుతాయి. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో యపిటోరియా (అరబిందో), అన్నపూర్ణ ఫైనాన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని సుమారు 230 ఖాళీలను భర్తీ చేయనున్నాయి. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీతో పాటు బి.ఎస్సీ/ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), డిప్లొమా కెమికల్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ మేళా ద్వారా ఎంపికైన వారికి పోస్టును బట్టి నెలకు రూ.14,500 నుండి రూ.35,000 వరకు వేతనం లభిస్తుందని, శ్రీకాకుళం, విజయనగరం, పరవాడ, పాయకరావుపేట వంటి ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా అర్హత ధ్రువపత్రాల నకళ్లు, ఆధార్ కార్డుతో నేరుగా హాజరుకావచ్చని సూచించారు. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ఒఒఒ.అఒ.వ్రశీజ.అఅ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ మేళాకు హాజరుకావచ్చని, మరిన్ని వివరాలకు స్థానిక ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## జిల్లా స్థాయి మాస్టర్స్ క్రీడా పోటీలకు ఎంపికలు

**శ్రీకాకుళం, మార్చి 4(వార్త):** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు జిల్లాలో శాప్ లీగ్ - మాస్టర్స్ స్పోర్ట్స్ (వెటరన్స్) ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు sports.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

### ఎంపికల వివరాలు:

టెన్నిస్ (పురుషులు, మహిళలు) పోటీలు 40 ఏళ్లు పైబడిన వారు అర్హులు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మార్చి 8న శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎంపికలు జరుగుతాయి. బ్యాడ్మింటన్ పోటీలకు 35 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలు, 45 ఏళ్లు పైబడిన పురుషులకి మార్చి 8న శ్రీకాకుళం డి.ఎస్.ఏ ఇండోర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తారు. అలాగే అథ్లెటిక్స్‌కు 35 ఏళు పై బడిన పురుషులు మహిళలు 45 ఏళ్లు పైబడిన పురుషులకు 100 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ. పరుగు పందెట్లులతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హైజంప్, జావలిన్ త్రో, 4ఇ100 రిలే పోటీలు ఉంటాయి. ఇవి మార్చి 24న కేఆర్ స్టేడియంలో జరగనున్నాయి.

### రాష్ట్ర స్థాయి పోటీలు:

జిల్లా స్థాయిలో ఎంపికైన వారు మార్చి నెలలో విజయనగరం (టెన్నిస్), కోనసీమ (బ్యాడ్మింటన్), గుంటూరు (అథ్లెటిక్స్)లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఇతర వివరాలకు 9390352942, 9494814087 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## గ్రామీణ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

**శ్రీకాకుళం, మార్చి 4(వార్త):** గ్రామీణ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దీన్ దయాల్ గ్రామీణ కౌసల్య యోజన కేంద్ర మేనేజర్ పి.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాల్ ఉద్యోగ కౌసల్య యోజన, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశానికి కావలసిన వయస్సు: 18-35 సంవత్సరాలు కలిగి, పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధృవీకరణ, బ్యాంక్ పాస్ బుక్ ౘ 4 పాస్‌పోర్ట్ ఫోటోలు ఉండాలన్నారు. 90 రోజులు ఇచ్చే శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కస్టమర్ కేర్, రిటైల్ సేల్స్ ఎక్సెక్యూటివ్, కంప్యూటర్ బేసిక్స్ నేర్పబడునని వివరించారు. స్టడీ మెటీరియల్, యూనిఫారమ్ ఉచితంగా అందించబడునని, శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్, భోజన సదుపాయం కల్పించబడునన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగం కల్పించబడుతుందన్నారు. దరఖాస్తు చేయుటకు ఈనెల 15 ఆఖరుతేదీ అని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, శ్రీ విశ్వ విజేత జూనియర్ కాలేజ్ బిల్డింగ్స్, శ్రీ చైతన్య స్కూల్ వెనుక, మహాలక్ష్మి నగర్ కాలనీ, శ్రీకాకుళం (8341693700, 7842084099)లో మరిన్ని వివరాలకు సంప్రదించాలన్నారు.

## 6న మెడికవర్‌లో మెగా వైద్య శిబిరం



**శ్రీకాకుళం, మార్చి 4(వార్త):**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 6న మెడికవర్ ఆసుపత్రిలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని గైనకాలజిస్టు బలగ రజిని, ఫిజీషియన్ కె.అమూల్య, మెడికవర్ ఆసుపత్రి హెడ్ పి.సాగరికి, ఏజీఎం టీఎస్ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మహిళలకు ఎటువంటి ఫీజు లేకుండా ఆరోగ్య పరీక్షలు చేస్తామన్నారు. రక్త పరీక్షలు మాత్రం 50 శాతం రాయితీతో చేపడతామని తెలిపారు. మహిళల్లో ఇటీవల అధికంగా ప్రబలుతున్న గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష (పాప్స్ పియర్) ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు.

## సైనిక స్కూల్‌కు కొంకడాపుట్టి విద్యార్థి

**మందస, మార్చి 4(వార్త):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సవర జాన్ జస్టిస్ అనే విద్యార్థి సైనిక పాఠశాలకు ఎంపికై అందరి అభినందనలు అందుకుంటున్నాడు. మందస మండలం కొంకడాపుట్టి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి సమర జాన్ జస్టిన్ ఇటీవల నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా కోరుకొండ సైనిక పాఠశాలకు పోటీ పరీక్షల్లో ఎంపికయ్యాడు. ఈ విద్యార్థిని మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు అభినందించి సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన సీపాన సూర్యనారాయణ సవర జాన్ జస్టిస్ సైనిక పాఠశాలకు సంబంధించిన పోటీ పరీక్షకు అన్ని రకాలైన కోచింగ్ ఇచ్చారు. సవర జాన్ జస్టిన్ తల్లి ప్రభుత్వ పాఠశాలలో టీచరుగా పని చేస్తూ, తన కుమారుడిని ప్రభుత్వ బడిలో చేర్పించడం ఎంతో గర్వకారణంగా ఉందని ఎంఈఓ లక్ష్మణరావు అన్నారు. ప్రధానోపాధ్యాయుడు సీపాన సూర్యనారాయణ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొంకడాపుట్టిలో గత రెండు సంవత్సరాల నుండి పని చేస్తున్నారు. గిరిజన విద్యార్థులకు నవోదయ పాఠశాలకు, ఏకలవ్య పాఠశాలకు, అంబేద్కర్ గురుకుల విద్యాలయాలకు, సైనిక పాఠశాలలకు ప్రత్యేకంగా ఐదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామ విద్యా కమిటీ, గ్రామ పెద్దలు అభినందించారు.



# స్వీయ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం

*** అదనపు ఎస్పీ కె.వి.రమణ**
*** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన**
*** మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నారిమణి ఆధ్వర్యంలో నిర్వహణ**



**శ్రీకాకుళం, మార్చి 4 (వార్త):** మహిళల స్వీయ రక్షణకి మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయని శ్రీకాకుళం జిల్లా అదనపు ఎస్పీ కె.వి.రమణ అన్నారు. తైక్వాండో, కరాటే వంటి ఆత్మ రక్షణ విద్యలను అభ్యసించడం వల్ల ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవచ్చని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ నారిమణి ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం సెల్ఫ్ డిఫెన్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ చీఫ్ కోచ్ లు మజ్జి గౌతమ్, పి.నవీన్‌ల ఆధ్వర్యంలో కోచ్‌లు,



తైక్వాండో స్టూడెంట్స్‌తో కలసి సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్‌లను చేసి చూపించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కె.వి.రమణ మాట్లాడుతూ మహిళలకి ఆపదలు ఎదురైనప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొనేందుకు మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరు కూడా విద్యార్థి దశలో సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకుంటే వారికి జీవితంలో అవి అండగా ఉంటాయన్నారు. శ్రీకాకుళం డిఎస్పీ వివేకానంద మాట్లాడుతూ విద్యార్థులకి చదువుతో పాటు స్వీయ రక్షణ శిక్షణ కూడా అవసరమన్నారు. పోలీసు శాఖ తరపున మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు నేరుగా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ లో సంప్రదించి సహాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు స్పెషల్ పి.పి విశాలాక్షి, అడ్వొకేట్ పొట్నూరు పద్మ, హ్యూమన్ రైట్స్ సభ్యులు మణిశర్మ, డాక్టర్ తంగి సౌజన్య, జేసీఐ ప్రెసిడెంట్ టి.ఉషారాణి, యోగ ప్రెసిడెంట్ తంగి స్వాతి, ఎస్ఐలు లక్ష్మి, చంద్రకళ, లావణ్య, ఏఎస్ఐలు అరుణ కుమారి, రేణుక, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రాప్ డైవర్షన్‌కు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ

*** రైతుల ఆదాయవృద్ధే లక్ష్యం * హార్టికల్చర్ హబ్ దిశగా 15 లక్షల హెక్టార్లలో క్రాప్ డైవర్షన్ ప్రణాళిక * భూగర్భ జలాల పరిరక్షణ, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం * విపత్తుల బారిన పడకుండా ఖరీఫ్ రెండు నెలల ముందుకు * రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు * అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**శ్రీకాకుళం, మార్చి4(వార్త):**రాష్ట్రంలో వరి పంట సాగు విస్తీర్ణాన్ని సమతుల్యం చేస్తూ రైతులను లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దారితీసే స్పష్టమైన విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసెంబ్లీలో తెలిపారు. క్రాప్ డైవర్షన్, మద్దతు ధరలు, సేంద్రీయ వ్యవసాయం, కౌలు రైతుల రుణాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ, 2025--26 క్రాప్ ఇయర్‌కు రాష్ట్రంలో వరి సాగు చేస్తున్న రైతులు మొత్తం 38.97 లక్షల మంది ఉన్నారని, అందులో ఖరీఫ్ 26.94 లక్షలు, రబీ 12.03 లక్షల మంది ఉన్నారని వెల్లడించారు. అధిక వరి సాగు ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల వంటి పంటలను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు, నాణ్యమైన విత్తనాల సరఫరా, సాంకేతిక మార్గదర్శకాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2025--26 సంవత్సరానికి సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి ప్రణాళిక అమలు చేస్తున్నామని, ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా ఆధునిక విత్తనాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యత నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణ అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, సాగునీటి లభ్యత పెరిగినప్పటికీ వరిపై అధిక ఆధారపడటం రైతులకు గిట్టుబాటు కాదని తెలిపారు. వరిని పూర్తిగా మానేయాలని ప్రభుత్వం చెప్పడం లేదని, అయితే పాత వంగడాల బదులు నాణ్యమైన, ఎగుమతులకు అనుకూలమైన కొత్త వంగడాలను ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు. మొదటి దశలో రాయలసీమ జిల్లాల నుండి ప్రకాశం జిల్లా వరకు 15 లక్షల హెక్టార్లలో క్రాప్ డైవర్షన్ చేపట్టి హార్టికల్చర్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 30,000 కోట్లు, ప్రైవేట్ రంగం ద్వారా 70,000 కోట్లు సమీకరించి హార్టికల్చర్ అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. సంవత్సర కాలంలో రైతులకు వరి పంటలో ఎకరాకు సుమారు ?6,000 ఆదాయం మాత్రమే వస్తుండగా, కంది పంటకు 26,000, మినుముల పంటకు 21,000, జొన్న పంటకు 16,000, పామాయిల్ పంటకు 1.50 లక్ష రూపాయల లాభం వస్తుందని వివరించారు. డైవర్షన్‌కు ముందుకొచ్చే రైతులకు పామాయిలు ఉచిత మొక్కలు, సాంకేతిక సలహాలు, డ్రిప్, స్ప్రింక్లర్ సదుపాయాలు కల్పించి, పండించిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మొక్కజొన్నకు ?2400 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో 90 శాతం నీటి నిల్వలు ఉన్నందున ఖరీఫ్ సాగును రెండు నెలలు ముందుకు తీసుకురావాలని, మే నెలలో ఖరీఫ్ ప్రారంభం అయ్యేలా ప్రతి గ్రామంలో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నామని, ఎమ్మెల్యేలు రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి పిలుపునిచ్చారు. కౌలు రైతుల విషయానికి వస్తే, 9.13 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులు జారీ చేసి ?4474 కోట్లు రుణాలుగా మంజూరు చేశామని వెల్లడించారు. రైతుల ఆదాయ వృద్ధి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో స్పష్టం చేశారు.



# జాతరకు వేళాయే!

*** 8 నుంచి సోంపేటలో నింభాషిని అమ్మవారి జాతర * మూడు రోజుల జాతరకు భారీ ఏర్పాట్లు**

**సోంపేట మార్చి 4 (వార్త):** సోంపేట ప్రజల గుండెల్లో కొలువైన నింభాషిని అమ్మవారి ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 8 నుంచి మూడు రోజులపాటు వైభవంగా జాతర నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీతో పాటు భక్తులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. సోంపేట నుంచి బూరగం వెళ్లే మార్గంలో గడ్డఒడ్డున వెలసిన నింభాషిని అమ్మవారికి సరిగ్గా 8 ఏళ్ల క్రితం భారీ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి నెల మొదటి ఆదివారం భారీ స్థాయిలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ప్రతి ఏటా మార్చి నెలలో అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని కూడా జాతరగా భారీ స్థాయిలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా అందుకు తగ్గట్టుగా భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు.

### విఘ్నేశ్వర పూజతో మొదలు..



జాతర కార్యక్రమంలో భాగంగా 8వ తేదీన ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పుణ్యాహవాచనం అఖండ దీప స్థాపన మండప ఆరాధనలు నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం రుద్రాభిషేకం అగ్ని ప్రతిష్ఠ హోమములు చేపట్టనున్నారు. రెండవ రోజైన 9వ తారీఖున ప్రాతక్కాల పూజలు శ్రీ చక్ర నవావరణర్చనము అష్టోత్తర శతకల స్వపనములు చేపట్టనున్నారు. సాయంత్రం చండీ హోమాన్ని నిర్వహిస్తారు. మూడవ రోజైన 10వ తారీఖున ప్రాతక్కాల పూజలు వాస్తు హోమాలు సామూహిక కుంకుమ పూజలు పూర్ణాహుతి నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం నుంచి భారీ స్థాయిలో అన్న సమారాధన జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బీన ఆనందరావు తెలిపారు. ప్రతి ఏటా ఇటువంటి అమ్మవారి చల్లదనోత్సవం ద్వారా అమ్మవారి అనుగ్రహం సోంపేట ప్రజలపై ఉండేలా కమిటీ కృషి చేస్తుందని అన్నారు. ఇటువంటి విశేష సందర్భంలో భక్తులు స్వయంగా అమ్మవారిని దర్శించి అమ్మవారి అనుగ్రహానికి ప్రీతిపాత్రులు కావాలని ఆయన కోరారు. అలాగే మూడు రోజులపాటు సాయంత్రం వేళ అమ్మవారు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జాతరను విజయవంతం చేయాలని ఆనందరావు కోరారు.

# కూటమి పాలనలో కల్తీ ప్రదేశ్‌గా రాష్ట్రం

*** వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ**



పలాస, మార్చి 4 (వార్త): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని విస్మరించడమే కాక, ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేయడం వల్ల , రాష్ట్రం కల్తీ ప్రదేశ్‌గా మారిందని వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ అన్నారు. ఆయన బుధవారం పలాసలో మాట్లాడుతూ ఎవరైనా బతకడం కోసం పాలు, నీరు తాగుతారన్నారు. కానీ రాష్ట్రంలో ఆ రెండు ప్రాణాంతకం అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతం చూసినా కల్తీ రాజ్యమేలుతుందని, పాలు, నీరు, ఆహారాన్ని కొందరు కల్తీ చేస్తుండంతో ప్రజలు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో పసి బిడ్డలపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో నిమిషానికి ఐదుగురుపై లైంగిక దాడులు జరుగుతున్న అంటూ కేంద్ర ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇచ్చిందన్నారు. గడచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ తో పాటు మరో 146 హామీలు అమలు చేయాలని ప్రజల తరఫున ఒక ప్రతిపక్షంగా వైయస్సార్సీపి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే, అందుకు తగ్గ సమాధానం చెప్పలేక, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందంటూ సీఎం చంద్రబాబు ఒకరోజు ఆరోపిస్తే, మరోసారి పంది కొవ్వు కలిసిందంటూ టిడిపి నేతలు ఆరోపిస్తుంటే, జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాత్రం మరో రకంగా మాట్లాడుతున్నారని, సిబిఐ నియమించిన సిట్ నివేదికలో కల్తీ జరగలేదని, సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పిస్తే, అందుకు జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వ పెద్దలు రోజుకు ఒక అబద్ధాన్ని సృష్టిస్తూ, వైయస్సార్సీపి పై అసత్య ప్రచారం చేస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు కూడా అమలు చేయలేకపోయారని, కనీసం ప్రజలకు మంచి తాగునీరు అందిస్తే చాలునని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి వంటి హామీలు ఎక్కడికెళ్లిపోయాయో కూటమి నేతలు స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత వేసవికాలంలో కనీసం ప్రజారోగ్యాన్ని పటిష్ట పరచాలని, లేకపోతే పారిశుద్ధ్యం, కలుషిత తాగునీరు వల్ల అనేక వ్యాధులు ప్రబలి పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కేవలం రెండేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతుందని, ఇప్పటికైనా కూటమి పెద్దలు కళ్ళు తెరచి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించాలని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని, లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని మడియ రామకృష్ణ హెచ్చరించారు.

# గర్భసంద్రం టైటిల్ ఆవిష్కరణ

**పలాస, మార్చి 4 (వార్త):** గర్భసంద్రం చిత్రంలో విలన్ పాత్రలో కుమార్ నాయక్ నటించగా మోంటి ప్రొడక్షన్ బ్యానర్ పై మున్నాభాయ్ నిర్మాతగా హైదరాబాద్ సారథి స్టూడియోలో పాన్ ఇండియా సినిమా టైటిల్‌ను తెలంగాణ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రముఖ కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూలో బడ్జెట్లో నూతన నటీనటులతో నిర్మించిన అనేక చిత్రాలు విజయవంతం అయ్యాయని, ప్రేక్షకులు వాటిని ప్రస్తుతం ఆదరిస్తున్నారని అన్నారు. కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ హంగామా లేకుండా అమ్మను ఉన్నత స్థానంలో చూపించిన గర్భసంద్రం కచ్చితంగా విజయం సాధిస్తుందని తెలిపారు. డాక్టర్ కుమార్ నాయక్, నీలిమ, శరణి , శ్రీదేవి , రూబీనా, శిరీష, శైలజ, అనూష , ప్రియాంక , హసీనా, హర్షద్, సురేందర్ రెడ్డి, పఠాన్ అహ్మద్, వెంకటేశ్వర్లు, పవన్ కుమార్ నటించగా, స్టోరీ రైటర్ గా మున్నాభాయ్, కో ప్రొడ్యూసర్స్‌గా బంగారు రాజు, మాటలు రచయితగా ప్రశాంత్, కో-దర్శకులు కిషోర్, మేనేజర్‌గా నవీన్ వ్యవహరించారు.



## నేడు అయ్యప్ప జన్మదిన వేడుకలు

**ఇచ్ఛాపురం, మార్చి 4 (వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం దగ్గరలో నిర్మితమైన అయ్యప్ప స్వామి పంచాయతన దేవాలయంలో గురువారం ఉత్తరా ఫల్గుణి నక్షత్రం హరిహరసుతుడు అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా తిరు నక్షత్ర సేవ స్వర్గీయ నారాయణ గురుస్వామి స్వర్గీయ దుర్గా గురుస్వామి దివ్య ఆశీస్సులతో ఆశి క్రిష్ణ గురుస్వామి, మణి గురుస్వామిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మావతి పట్నాయక్ చెప్పారు. ఉదయం 4 గంటలకు స్వామి వారికి అష్టదశ అభిషేకములు, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ, హారతులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిన్ని త్రినాధ్ స్వామి ఆలయానికి ఉత్సవమూర్తి అయ్యప్ప స్వామి విగ్రహాన్ని అందజేశారు, ఆయన చేతుల మీదగా స్వామి విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు.

## నరసన్నపేటలో డ్రైనేజీ సమస్యలు

**నరసన్నపేట,మార్చి 4(వార్త):** నరసన్నపేటలో మౌలిక వసతుల సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లచ్చుమన్నపేట ముందు ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిండిపోయి మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని తెలిపారు. ఈ సమస్యపై పంచాయతీ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. అలాగే జగన్నాధపురం కాలనీలో మూడు వీధుల్లో వీధి లైట్లు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

**శ్రీకాకుళం క్రైం, మార్చి 4 (వార్త):** ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. నందిగాం మండలం వేణుగోపాలపురం గ్రామానికి చెందిన కింతలి ప్రవల్లిక(18) టెక్కలి ఐతం కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం కళాశాల నుంచి తిరిగి ఇంటికి బయలుదేరిన ఈమె తలగాం గ్రామ కూడలి సమీపంలో రాజ్యరాణి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. తండ్రి భవన నిర్మాణమేస్త్రిగా పనిచేస్తుండగా, తల్లి శిరీష గృహిణి. వీరి చిన్నకుమార్తె బీఫార్మసీ చదువుతోంది. ఇటీవల ఆమెకు పెళ్లి నిశ్చయమైంది. ఏమైందో ఏమోగాని రైలు కింద పడి ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని చూసి కన్నీరుమన్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గోపాలపెంట యువకుడు మృతి

**నరసన్నపేట,మార్చి 4 (వార్త):** నరసన్నపేట మండలం గోపాలపెంట గ్రామానికి చెందిన సనపల బాలకృష్ణ (36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జీవనోపాధి కోసం మంగళగిరిలోని ఒక పరిశ్రమలో పనిచేస్తున్న బాలకృష్ణ ఈ నెల 1వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అదే రోజు రాత్రి చికిత్స పొందుతూ మరణించాడు. మృతిచెందిన విషయం బంధువులకు ఆలస్యంగా తెలియడంతో వారు మంగళగిరికి చేరుకుని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళవారం సాయంత్రం మృతదేహాన్ని గోపాలపెంట గ్రామానికి తరలించారు. బుధవారం ఉదయం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బాలకృష్ణ మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏపిటిపిసి చైర్మన్ వజ్జ గ్రీవెన్స్



**పలాస, మార్చి 4 (వార్త):** తెలుగుదేశం పార్టీ (టీడీపి) కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన వెంట ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ ఉన్నారు.

## బీసీ సంక్షేమ సదస్సులో జయదేవ్



**ఇచ్ఛాపురం,మార్చి 4 (వార్త):** తిరుపతి లో జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ విస్తృత స్థాయి సమావేశం లో రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కాళ్ల జయదేవ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటగా, బీసీ యువతలో అవగాహన పెంచడానికి రాష్ట్ర స్థాయిలో యువజన అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించాలని, యువతకు విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలపై మార్గదర్శనం ఇవ్వాలని, బీసీ విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సదుపాయాలపై సరైన సమాచారం చేరేలా జిల్లా స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు.గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి యువజన కమిటీలు ఏర్పాటు చేసి నాయకత్వ శిక్షణ ఇవ్వాలని కోరారు.ఈ సూచనలను రాష్ట్ర సంఘం పరిశీలించి అమలు చేస్తే బీసీ సమాజానికి మరింత మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు నూకణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి గ్రాండ్ పరీక్షల ఆకస్మిక తనిఖీ



**జలుమూరు, మార్చి 4 (వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రాండ్ పరీక్షల విధానాన్ని ఎంఈఓ--2 ఎం.వి.ఆర్.ఎస్ ప్రసాదరావు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. జలుమూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను తనిఖీ చేసిన ఆయన, పరీక్షలు పకడ్బందీగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. పరీక్షల ఫలితాలే విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు ప్రీ ఫైనల్ పరీక్షలు

**జలుమూరు, మార్చి 4(వార్త):** జలుమూరు మండలంలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాశారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా అక్షరాస్యత పెంపొందించేందుకు ఈ పరీక్షలను నిర్వహించినట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. శత శాతం అక్షరాస్యత సాధనలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు ఈ పరీక్షలకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. మహిళల సాధికారత దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అడుగని అధికారులు పేర్కొన్నారు.



# విజయదుర్గా దేవాలయ పునః ప్రతిష్టా సహిత మహాకుంభాషేకం

* 5న శోభాయాత్రతో ప్రారంభం
* 6 నుంచి అమ్మవారి ఆలయ ప్రతిష్టామహోత్సవాలు
* 8న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, 10న మహాకుంబాభిషేకం



**శ్రీకాకుళం, మార్చి 4 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయదుర్గ అమ్మవారి దేవాలయ పునః ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతుందని విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ తెలిపారు. నగరంలోని నానుబాలవీధిలో ఉన్న విజయదుర్గా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేవాలయ పునః ప్రతిష్ట మహోత్సవాలు 6 నుంచి ప్రారంభమై 10వరకు కొనసాగుతుందని వివరించారు. 5న సాయంత్రం చిన్నబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి శ్రీ విజయదుర్గ అమ్మవారి విగ్రహ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ యాత్ర స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ నుంచి ప్రారంభమై ఏడురోడ్ల కూడలి నుంచి కృష్ణాపార్కు మీదుగా శ్రీ విజయదుర్గ ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. ఈ యాత్ర ఇటీవల గిన్నీస్‌బుక్ సాధించిన ప్రముఖ నృత్య దర్శకురాలు నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వస్తారని తెలిపారు. 6, 7 తేదీల్లో ఉదయం 6.50 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, పుణ్యావహచనం, ప్రతిష్ఠ సంకల్పంతో ప్రారంభమై అమ్మవారికి జలాధివాసం, క్షీరాధివాసం, ధ్యాన్యాధివాసంతో పాటు ఐదు రకాల ధాన్యాధివాసాలతో అమ్మవారికి అర్చన కళాధిహోమాలు నిర్వహిస్తామని చెప్పారు. 8న ఉదయం 10.40 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, సాయంత్రం కుంభాషేకం ప్రారంభిస్తామని చెప్పారు. 9న ఉదయం మహాకుంబాభిషేకం హోమాలు పూర్తి చేసుకొని 10న ఉదయం 9.30 గంటలకు అమ్మవారి శిఖరానికి 1008 కలశాలతో అష్టమూలిక జలాలతో అభిషేకం నిర్వహిస్తారన్నారు. 12న మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఆలయాన్ని కృష్ణశిలతో నిర్మించామన్నారు. ఆలయంలో శ్రీ చక్రం భక్తుల శిరస్త్రారం చూస్తున్నట్టు ఆలయ పైకప్పుపై ఏర్పాటు చేయించామని వివరించారు. వీటితో పాటు అష్టాదశ శక్తి పీఠాలు విగ్రహ రూపంలో ప్రధాన ద్వారంపై ఉండడం ఆలయానికి ప్రత్యేకతగా నిలుస్తుందన్నారు. ఆలయానికి దక్షిణ ముఖంగా కాళీ, ఉత్తర ముఖంగా సరస్వతి, తూర్పు ముఖంగా విజయదుర్గా, పడమట ముఖంగా లక్ష్మీల విశేష అనుసంధానంగా నిలుస్తోందని చెప్పారు. మండపంలోని చతుర శిలా స్తంభాలపై చతుర్వేద పురుషులతో ఉండడం అరుదైన దృశ్యంగా అభివర్ణించారు. దక్షిణ ముఖంగా కాళీ ఉండడం గొప్ప విశేషమని పేర్కొన్నారు. అయోధ్య బాలరాముడి విగ్రహం తయారు చేయగా మిగిలిన శిలా భాగాన్ని తెప్పించి అమ్మవారి విగ్రహాన్ని అదే వర్ణంతో తయారు చేయించామన్నారు. ఇది జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ మహోత్సవాలకు సమతానంద దుర్గా మహాపీఠం అధిష్టాన పీఠాధిపతులు శ్రీ శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి, హిమాలయ పరంపర సిద్ధ గురువులు శ్రీశ్రీశ్రీ పరమేశ్వరానందగిరి గురూజీలు పాల్గొంటారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయ అర్చకులు ఆరవెల్లి ఫణికుమార్ శర్మ, చంద్రశేఖరశర్మ, ప్రముఖ నృత్యదర్శకురాలు నీరజా సుబ్రహ్మణ్యం, మంగళంపల్లి వరలక్ష్మీ, కిల్లంశెట్టి వెంకటరావు, సూర్య కుమారి, యల్లాల చంద్రకళ, ఊర్వశి ప్రదీప్, గంగుల ఆనందరావు, కిల్లారి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి



**ఇచ్ఛాపురం, మార్చి 4 (వార్త):** శాంతినికేతన్ హై స్కూల్‌లో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు శక్తి టీమ్ -5 కాశీబుగ్గ పోలీస్ యాంటీ డ్రగ్స్, ఫోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలు అందరు శక్తి అప్ డౌన్లోడ్ చేసుకోవాలని తెలియజేసారు. ఈ యాప్ ద్వారా ఆపదలో ఉన్నప్పుడు ఎస్ వో ఎస్ బటన్ నొక్కితే తక్షణమే పోలీసు సహాయం, లైవ్ లోకేషన్ షేర్ అవుతుందని,ఈ యాప్ ద్వారా నేరాల రేటును తగ్గించడం మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం పోలీసుల లక్ష్యంఅని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు ప్రస్తుతం సర్వసాధారణమయ్యాయని, ఇవి నకిలీ వెబ్‌సైట్లు, వో టి పి షేరింగ్, నకిలీ ఆఫర్లు, మరియు సోషల్ మీడియా లింక్‌ల ద్వారా జరుగుతాయని డబ్బు లేదా వ్యక్తిగత డేటాను దొంగిలించడానికి స్కామర్లు బ్యాంక్ అధికారులలా నటిస్తారని మోసపోతే వెంటనే 1930 కి కాల్ చేసి లేదా సైబరక్రైమ్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. వాట్సాప్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో లింక్‌లు పంపి, క్లిక్ చేయమని, ఆపై లాటరీ గెలుచుకున్నారని నమ్మిస్తారని తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, నకిలీ ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టించి మోసం చేస్తారు.వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని .గంజాయి వాడకం వల్ల మతిమరుపు, ఆందోళన, గుండె సమస్యలు మరియు శ్వాసకోశ సమస్యలు తలెత్తవచ్చు.గంజాయి వాడకం ఆరోగ్యానికి అత్యంత హానికరం. కాబట్టి డ్రగ్స్ వాడొద్దని దానికి దూరంగా ఉండాలని తెలియజేసారు. అనంతరం స్కూల్ చైర్మన్ డి. కృష్ణ మూర్తి రెడ్డి మాట్లాడుతూ పోలీస్ వారు చెప్పిన విషయయాలు పై చాలా జాగ్రత్త గా ఉండాలని ఆన్లైన్ మోసలకు దూరంగా ఉండాలని పోలీస్ వారు చెప్పిన మాటలను మరిచి పోకుండా ఇప్పటికప్పుడు గుర్తుంచుకోవాలని అలాగే దీనిపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని తెలియ జేశారు. ఈ కార్యక్రమం లో ఏ ఎస్పై బైరాగి, పోలీస్ సిబ్బంది కె. వాసుదేవరావు, బి. ధనలక్ష్మి స్కూల్ మేనేజర్ కె. సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, శాంతి పాల్గొన్నారు.



## ఏడిఆర్ఎం రామారావుకు 'వాడ బలిజ రత్న' అవార్డు

**సోంపేట మార్చి 4 (వార్త):** ఓ మారుమూల గ్రామంలో పుట్టి ఉన్నత చదువులు చదివి ఉన్నతమైన భవిష్యత్తు కోసం అంకితభావంతో కృషిచేసి అత్యున్నత ఆశయంతో అంచెలంచెలుగా ఎదిగిన సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామానికి చెందిన కుందు రామారావు కొత్తగా ఏర్పాటయిన సౌత్ కోస్ట్ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ హోదాలో విశాఖలో పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఆయన యొక్క అపారమైన సామర్థ్యం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. అత్యంత వెనుకబడిన వాడ బలిజ సామాజిక వర్గంలో జన్మించి ఎంతో కృతనిత్యంతో ఉన్నత చదువుల కోసం శ్రమించి అత్యున్నత ఉద్యోగం సాధించి ఆ సామాజిక వర్గంలో ఓ విద్యారత్నంలా విరాజిల్లుతూ అసాధ్యం అనుకునే ఏడిఆర్ఎం పోస్టును సుసాధ్యం చేస్తూ తాను సొంతం చేసుకున్న రామారావును ఇటీవల చత్తీస్గఢ్ రాష్ట్రం బిలాయిలో జరిగిన వాడబలిజ తెలుగు మహా సమ్మేళనంలో ప్రత్యేకంగా గుర్తించారు. ఈ సందర్భంగా రామారావుకు వాడ బలిజ రత్న అవార్డును ప్రధానం చేశారు. అయితే ఏడిఆర్ఎం రామారావు అనివార్య కారణాల వలన హాజరు కాలేకపోవడంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడ బలిజ ప్రముఖుల ద్వారా అందుకు సంబంధించిన మెమెంటోను బుధవారం విశాఖపట్నం లో అందజేశారు.

## ఈదుపురంలో అక్షరాస్యతపై ప్రత్యేక సమావేశం

**ఇచ్ఛాపురం,మార్చి 4 (వార్త):** ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో "అక్షరాంధ్ర" కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ఓల్డ్ కాలనీ ప్రాంతంలో మహిళలు గ్రామస్థుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూత్ లీడర్ హంగీర్ బెహరా మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు చదువు నేర్చుకుని తమ పేరును స్వయంగా సంతకం చేయగలగాలని, పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. "అక్షరాలు నేర్చుకుంటే జీవితం మారుతుంది. చదువు ఉన్నవారు సమాజంలో గౌరవంగా నిలబడగలరు. అందరూ చదవాలి, నేర్చుకోవాలి" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువకులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని ఆసక్తిగా వినిపించారు. అక్షరాస్యత గ్రామాభివృద్ధికి ముఖ్యమని అందరూ ఒకే అభిప్రాయం వ్యక్తం చేశారు.

# జేసీఐ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు




**ఇచ్ఛాపురం, మార్చి 4 (వార్త):** జేసీఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో స్వేచ్ఛానగర్‌లో హోలీ పార్టీ రంగ్ దే ఇచ్ఛాపురం 2026 వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. జేసీస్ సభ్యులు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకలు జేసీఐ ఇచ్ఛాపురం ఐక్యత, క్రమశిక్షణ మరియు సంస్థ బలాన్ని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమానికి ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. జేసీఐ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ యువత సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ఆమె పాల్గొనడం సభ్యులకు మరింత ఉత్సాహాన్ని కలిగించిందని అన్నారు. జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షులు జేసీ శ్రావణ్ బోయిన హోలీ పండుగ యొక్క అసలైన భావాన్ని వివరించారు. హోలీ అనేది కేవలం రంగుల పండుగ మాత్రమే కాకుండా, ఐక్యత, స్నేహబంధం మరియు ఆనందాన్ని పంచుకునే పండుగ అని తెలిపారు. కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో వీడియో రూపంలో చిత్రీకరించి పాల్గొన్న ప్రతి ఒక్కరి ఆనంద క్షణాలను ప్రత్యేకంగా నిలిపారు. కార్యక్రమంలో హోలీ కింగ్, హోలీ క్వీన్, హోలీ డాన్స్ స్టార్, పిల్లలు మరియు పెద్దల కోసం ప్రత్యేక హోలీ కపుల్ పోటీలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రాజెక్ట్ చైర్మన్ జేసీ సిరిషా దాస్ (లేడీ జేసీస్ డైరెక్టర్) ఆధ్వర్యంలో, ఖజానాదారు జేసీ సిహెచ్ రేణుకాదేవి సహకారంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. కార్యదర్శి సంతోష్ సాహు లేడీ జేసీస్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని సంస్థ బలాన్ని చాటిచెప్పారు. జేఎఫ్ఎమ్ శణ్ముఖ్ తంగుడు (జెడ్‌సీ--సీడీ), జేసీ లో అడ్వైజర్ దినేష్ పైడిసెట్టి, జేసీ అనిత్ చౌదరి (సెక్రటరీ --పిఆర్ మార్కెటింగ్), పి. స్నిగ్ధ, జేసీ ఉల్లాల శేషు యాదవ్, జేసీ డాక్టర్ మట్టా శ్రీనివాస్, హెచ్‌జిఎఫ్ పవన్, హెచ్‌జిఎఫ్ డా. మోహన్ వెంకటేష్, జేసీ వై. నరేష్, జేసీ శ్యామ్, జేసీ శ్రవ్య, జేసీ సిహెచ్ గౌరిజి, జేసీ రోహిత్, జేసీ కిరణ్ కుమార్ తదితరులతో పాటు ఆర్‌టిఎన్ దాస్, ఉల్లాల భారతి , సాసనపూరి సిరిష , ఇన్‌స్టా స్టార్ చి. రవి, చి. మధు, కె. అనిల్, వెంకటరమణ, నవీన్ చౌదరి, కె. సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సురంగి రాజా మైదానం లో హోళీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం కొనసాగించాలి

**నరసన్నపేట, మార్చి 4(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (జి.ఎఫ్.ఎల్.ఎన్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా కొనసాగించాలని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు సూచించారు. బుధవారం నరసన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మమేకమై మాట్లాడిన వారు, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో మౌలిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చైతన్యం కలిగించి, బలమైన విద్యా పునాది ఏర్పరచడం ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

## ఈనెల 12న దండి మార్చ్

**నరసన్నపేట, మార్చి 4 (వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన దండి మార్చ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం రాత్రి 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమంలో సీసీ జయశంకర్ ఆధ్వర్యంలో ప్రచార పాంప్లెట్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించబడుతుందన్నారు.

## నిరుపేదలకు ఉచిత అంబులెన్స్ సేవలు

**నరసన్నపేట, మార్చి 4 (వార్త):** నరసన్నపేట పట్టణ కలింగ వైశ్య సంఘ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ప్రతినిధి ఉన్ వెంకటేశ్వరరావు నిరుపేదలకు ఉచితంగా అంబులెన్స్ సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. మంగళవారం రాత్రి నరసన్నపేటలో ఆయన మాట్లాడుతూ, తన మాతృమూర్తి లలితాంబ ఇటీవల మరణించారని తెలిపారు. ఆమె స్మారకార్థంగా అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు తక్షణ సహాయం అందేలా ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

## పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

**నరసన్నపేట,మార్చి4 (వార్త):** నరసన్నపేట మండలంలోని పాలకొండపేట, ఉర్లాం గ్రామాల వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి 11 మందిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ, ముందస్తు సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది సహకారంతో రెండు చోట్ల ఒకేసారి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఘటన స్థలాల్లో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అరెస్టు చేసిన వారి వద్ద నుంచి సుమారు రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**పోలాకి, మార్చి 4(వార్త):** కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు. గాతలవలస గ్రామానికి చెందిన పొందర భవానీ అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, మంజూరైన రూ.23,920ల చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## సీతంపేటలో 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన' ప్రారంభం

**పలాస, మార్చి 4 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పంచాయితీ పరిధిలోని సీతంపేట గ్రామంలో పలాస ఎమ్మెల్యే ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశానుసారం పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనను రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ సంయుక్తంగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామ అభివృద్ధిని వేగవంతం చేయడం ఈ పథక లక్ష్యమని తెలిపారు. గ్రామీణ కార్మికులకు నిరంతర ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గణేష్, కో ఆప్షన్ సభ్యులు విఘ్నేష్, సీనియర్ నాయకులు మోహనరావు, నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీ, ఉపాధి శ్రామికులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546